క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణం లోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

శ్రీశైలం డ్యాం ఈఈగా మనోహర్‌రాజు



శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం నూతన ఈఈగా ఎన్.మనోహర్ రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల తెలుగుగంగ సర్కిల్ 1వ డిస్ట్రిబ్యూటరీలో పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇన్‌చార్జ్ ఈఈగా ఇప్పటి వరకు డ్యాం డిప్యూటీ ఎస్ఈ గంగాధర్ రెడ్డి పనిచేశారు. గురువారం గంగాధర్‌రెడ్డి బాధ్యతలను మనోహర్‌రాజుకు అప్పగించారు.

చిన్నబాబు మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

వెలుగోడు: నంద్యాల పట్టణానికి చెందిన చిన్నబాబు ఆత్మహత్యకు కారణమైన నంద్యాల వన్ టౌన్ పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రామదాసు డిమాండు చేశారు. చిన్నబాబు మరణం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం సీఐటీయూ మండల అధ్యక్షులు వి నాగమోహన్‌తో కలిసి రామదాస్ విలేకరులతో మాట్లాడారు. నంద్యాల పట్టణం లోని తోట లైనుకు చెందిన చిన్నబాబు కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చినంద్యాల టౌన్ లో ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో కేవీపీఎస్ నాయకులు వెంకటయ్య, దర్గయ్య, నాగేంద్ర, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే జైలుశిక్ష



హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఏఎల్ఓ లు వెంకటేశ్వర్లు, శోభారాణి, నీలిమసంధ్య

జూపాడుబంగ్లా: 18 ఏళ్లలోపు వయసున్న పిల్లలను పనిలో పెట్టుకుంటే వారికి జరిమానా, జైలు శిక్ష తప్పదని నందికొట్కూరు, బనగానపల్లె, డోన్ అసిస్టెంట్లు లేబర్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, శోభారాణి, నీలిమ సంధ్య హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో బాలకార్మికులపై తనిఖీలు నిర్వహించారు. హోటళ్లు, మెకానిక్ షాపులు, చికెన్ దుకాణాలు, కిరాణం షాపులు, తదితర దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఎక్కడా బాలకార్మికుల ఆచూకీ లభించలేదన్నారు.

నీటి ముంపు నిర్వాసితుల గ్రామసభ



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

పాములపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం శ్రీశైలం నీటి ముంపు ప్రాజెక్టు నిర్వాసితుల కోసం గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్లు విజయలక్ష్మి, శ్రీరాధ మాట్లాడుతూ.. 6 మండలాల్లో 4,583 మంది రైతులకు 2014వ సంవత్సరంలో రూ.12 కోట్లు మంజూరైందన్నారు. వెయ్యి మంది రైతులకు అప్పట్లో సెటిల్ అయ్యిందని, కాగా 33 గ్రామాలకు చెందిన పెండింగ్ కేసులు పరిశీలన నిమిత్తం సరైన డాక్యుమెంట్లతో రావాలని బాధితులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. పాములపాడు 3, తుమ్మలూరు 25, చెలిమిల్ల 9, జూటూరులో 109 మంది ఉన్నారన్నారు. కాగా వీరిలో 70 మంది డాక్యుమెంట్లతో హాజరుకాగా పరిశీలించినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో సీనియర్ అసిస్టెంట్లు రాధమ్మ, లక్ష్మిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరిస్తాం

జూపాడుబంగ్లా: విద్యుత్ సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే సత్వరమే పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో ఏఈ రామాచారి తెలిపారు. గురువారం జూపాడుబంగ్లా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వినియోగదారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ రైతులకు, గృహవిద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం నెలకొనకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రైతులకు పగటివేళల్లో నిరంతరాయంగా 9గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకొని డబ్బులు చెల్లించిన నెలరోజుల్లోనే మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వినయ్ కుమార్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతకు బయోమెట్రిక్

- పేద విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ
- విద్యార్థుల నుంచి వేలిముద్రల స్వీకరణ
- 80 శాతం పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు
- పూర్తి చేసే పనిలో ఉపాధ్యాయులు బిజీ
- ఉదయమే పాఠశాలలకు చేరిన ఎంఈఓలు



విద్యార్థినీతో బయోమెట్రిక్ నమోదు చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్, డీటీపీ ఆపరేటర్ మధు



జేవికే కిట్లు తీసుకుని ఆనందంతో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

పగిడ్యాల: సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ముఖ్యంగా పేద విద్యార్థులకు ఆర్థిక భారం లేకుండా చదువు కొనసాగించడానికి అమలు చేస్తున్న జగనన్న విద్యా కానుక పథకం వరంగా మారింది. ఈ ఏడాది కానుకల పంపిణీలో పారదర్శకత పాటించేందుకు విద్యార్థుల నుంచి వేలిముద్రలు స్వీకరించాలని ఆదేశించింది.

తొలి రోజే 'కానుక' పంపిణీ..

ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాం క్లాత్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్, ఒక సెట్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను ఉచితంగా కిట్ల రూపంలో అందజేస్తోంది. పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కొత్తగా చేరిన వారికి కూడా అదే రోజు కిట్లను అందజేస్తున్నారు.

బయోమెట్రిక్ ప్రక్రియ వేగవంతం

2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఈనెల 12వ తేదీనే పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యా కానుక కిట్లు అన్ని పాఠశాలలకు చేరినందున జిల్లా ఉన్నతాధికారులు బయోమెట్రిక్ వేగవంతం చేసి గురువారానికి 80 శాతం పూర్తి చేయాలనే ఆదేశాలు జారీ చేశారు. అయితే నియోజకవర్గంలోని మండలాల్లో పెద్దగా పురోగతి లేదు. వేలిముద్రల శాతాన్ని బట్టి మండలాన్ని గ్రీన్, ఎల్లో, రెడ్ జోన్లలో ఉంచారు. (60 లోపు ఉంటే రెడ్, 60 పైన ఎల్లో, 73పైన గ్రీన్ జోన్) కాగా నియోజకవర్గంలో మిడుతూరు, పాములపాడు మినహా మిగతా అన్ని మండలాలు రెడ్ జోన్‌లో ఉన్నాయి. దీంతో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్, డీటీపీ, సీఆర్‌పీలు, ఉదయాన్నే పాఠశాలలకు చేరి విద్యార్థుల వేలిముద్రలు సేకరించే పనిలో తలమునకలయ్యారు. మధ్యాహ్న భోజనం సమయంలో ఎంత మంది పిల్లలు హాజరయ్యారో వారందరి వేలిముద్రలు

మండలం	విద్యార్థులు	బయోమెట్రిక్ శాతం	జోన్
పగిడ్యాల	3,504	60	రెడ్
నందికొట్కూరు	6,530	42.71	రెడ్
కొత్తపల్లి	3,067	50.90	రెడ్
పాములపాడు	3,663	66.23	ఎల్లో
మిడుతూరు	3,736	73.21	గ్రీన్
జూపాడుబంగ్లా	3,849	41.41	రెడ్

సేకరించాలని నంద్యాల జిల్లా డీఈఓ సుధాకర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

జిల్లా అధికారుల ఆదేశాలు బేఖాతర్‌పై ఎంఈఓ ఆగ్రహం

జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సుజన 7, 8 తరగతి విద్యార్థులకు బయోమెట్రిక్ తీసుకోకుండా పంపివేయడంపై ఎంఈఓ సుభాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు ఉన్నా ఎందుకు బయోమెట్రిక్ తీసుకోలేదని ప్రశ్నించారు.

జగనన్న కిట్లు అందుకోవడం ఆనందంగా ఉంది



జగనన్న విద్యా కానుక కిట్లు ఉచితంగా అందుకోవడం వలన చాలా ఆనందంగా ఉంది. పేదల విద్యార్థుల చదువు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపించడం మరువలేం. గతంలో పాఠశాలలు తెరిచిన రోజే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం దుస్తులు పంపిణీ చేయలేదు.

– మౌనిక, 10వ తరగతి, కస్తూర్బా పాఠశాల

బాగా చదివి ఆణిముత్యాల అవార్డు అందుకోవాలని ఉంది



పదవ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకుని జగనన్న ఆణిముత్యాలు అవార్డును అందుకోవాలని ఉంది. ఏ ప్రభుత్వం పేదల చదువుల కోసం కోట్లాది రూపాయాలను ఖర్చు చేయలేదు. మనబడి నాడు నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు.

– పల్లవి, 9వ తరగతి, కస్తూర్బా పాఠశాల

నేడు పూర్తి చేస్తాం

పగిడ్యాల మండలంలో గురువారం నాటికి 60 శాతం బయోమెట్రిక్ పూర్తి చేశాం. మిగిలిన విద్యార్థులతో శుక్రవారానికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నాం. ఈ మేరకు హెచ్‌ఎంలకు సూచనలిచ్చాం.

– సుభాన్, ఎంఈఓ, పగిడ్యాల

దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా మోడల్ పాఠశాలలో 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 7వ తరగతిలో ఒక్క సీటు, 8వ తరగతిలో 2 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు ఈనెల 24వ తేదీ లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 26న పాఠశాలలో ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు.

ఈ-శ్రమ్ నమోదు చేసుకోండి

జూపాడుబంగ్లా: అసంఘటిత కార్మికులు సామాజిక భద్రతకోసం ఈ- శ్రమ్‌లో పేరు, వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నందికొట్కూరు లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 18 నుంచి 60ఏళ్ల వయసున్న భవన, వసల, వ్యవసాయ కార్మికులతో పాటు వీధి వ్యాపారులు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, మత్స్య, ప్లాంటేషన్, ఉపాధిహామీ పథకం కూలీలు పాల వ్యాపారులు, చిరువ్యాపారులతో పాటు ఈఎస్ఐ మరియు ఈపీఎఫ్ సభ్యత్వం లేని వారు, రూ.15వేలలోపు వార్షికాదాయం ఉన్న వారు అర్హులన్నారు. ఓ పర్యాయం పేరు రిజిస్ట్రేషన్ చేయించుకొంటే 60ఏళ్ల వరకు ఉంటుందన్నారు. సీఎస్‌సీ సెంటర్లు, పోస్టాఫీసులు, వార్డు, గ్రామ సచివాలయాల్లో ఉచితంగా పేర్లు నమోదు చేయించుకోవచ్చని చెప్పారు.

చల్లబడ్డ వాతావరణం

కొత్తపల్లి: బుధవారం రాత్రి కురిసిన వర్షంతో వాతావరణం కాస్త చల్లబడింది. మండలంలోని ఎర్రమఠం, గుమ్మడాపురం, శివపురం, కొక్కెరంచ, ఎదురుపాడు, దుద్యాల, నందికుంట, గువ్వలకుంట్ల, గ్రామంతో పాటుగా కొత్తపల్లి మండల కేంద్రంలో 9.88 మి.మీల వర్షపాతం నమోదైనట్లు గురువారం ఏఎస్ఓ రాజ్ పాల్ తెలిపారు. వర్షం రాకతో రైతన్నలు పొలాల్లో దుక్కులు, ఇతరత్ర పనులను ప్రారంభించారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థికి జగన్న విద్యా కానుక కిట్టును అందజేస్తున్న ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి

పగిడ్యాల: పేద విద్యార్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మండల ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అన్నారు. గురువారం స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంఈఓ సుభాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంక్షేమానికి జగనన్న అందిస్తున్న ప్రోత్సాహం ప్రశంసనీయమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువు కోసం నిధులు కేటాయించలేదన్నారు. విద్యను వ్యాపారంగా చేసి పేదలు చదువును కొనుక్కునే పరిస్థితులను కల్పించారని గత టీడీపీ ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారిణి ఉష, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

జూలై 10లోగా పనులు పూర్తి చేయండి



కస్తూర్బా భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈఈ రామకృష్ణారెడ్డి

పగిడ్యాల: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయం, రైతు భరోసా, హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను జూలై 10లోగా పూర్తి చేయాలని నంద్యాల జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ రామకృష్ణారెడ్డి ఆదేశించారు. గురువారం మండలంలోని పగిడ్యాల, సంకిరేణిపల్లె గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో రూ.1.06 కోట్లు చేపట్టిన 8 అదనపు రూముల పనులు బేస్‌మెంట్ స్థాయిలోనే ఉండడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే నెల 10లోగా పనులన్నిటినీ పూర్తి చేయించాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆమనికి ఆదేశించారు. నందికొట్కూరు డీఈ ధనిబాబు, మండల ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కార్తీక్ తదితరులు ఉన్నారు.

టాస్క్‌ఫోర్స్ కమిటీ చురుగ్గా పని చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నరాధిక

పాములపాడు: గ్రామ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ చురుగ్గా పని చేయాలని తహసీల్దార్ రత్నరాధిక, ఏఓ ఫణీశ్వరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవినీతి కార్యక్రమాలు జరిగినా వెంటనే మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందించాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రరంభమైందని, విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అనుమతి లేకుండా విక్రయాలు జరుగుతున్నట్లెతై కమిటీ సభ్యులు వెళ్లి పరిశీలించాలని చెప్పారు. రైతులకు అవగాహన కల్పించాలని వివరించారు. అలాగే కేసీ కెనాల్, తెలుగు గంగ కాల్వల వెంట మట్టి తవ్వకాలపై నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో కేసీసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ నగేష్, ఏఈఓ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

బస్సులు సున్నిపెంటకు వచ్చేలా చర్యలు తీసుకోండి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంట బస్టాండ్‌కు అన్ని ఆర్టీసీ బస్సులు వచ్చే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘం జిల్లా నాయకులు వై.ఆశీర్వాదం డిమాండ్ చేశారు. సున్నిపెంట ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ సుమారు 40 వేల జనాభా కలిగిన సున్నిపెంట గ్రామంలో ఉన్న బస్టాండ్‌కు ప్రతి ఆర్టీసీ సర్వీసు బస్సు రావాలనే నిబంధన ఉన్నప్పటికీ డ్రైవర్లు బస్సులను నేరుగా శ్రీశైలానికి తీసుకెళ్తున్నారన్నారు. దీని వలన ఇక్కడి ప్రజలు దోర్నాలలో, లేదా ముఖద్వారం వద్ద దిగి సున్నిపెంటకు రావడానికి ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను డ్రైవర్లు నేరుగా శ్రీశైలం తీసుకెళుతున్నారన్నారు. ఎన్నిసార్లు ప్రజా సంఘాలు ధర్నాలు చేసినా డ్రైవర్ల తీరులో మార్పు రావడం లేదని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు



ప్రభుత్వ వైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

ఆత్మకూరు: ప్రభుత్వ వైద్యశాలకు తరలివచ్చే రోగులకు నిర్లక్ష్యం లేకుండా నాణ్యమైన వైద్యం అందించాలని నంద్యాల డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ ఆదేశించారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కురుకుంద హెల్త్ సబ్ సెంటర్‌ను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోగులు ఏ సమయంలో వచ్చినా వైద్య సేవలు అందించాలని, ఎలాంటి అన్ని వైద్యశాల్లో పుష్కలంగా మందులు ఉన్నాయన్నారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు అత్యవసర రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కాంతరావునాయక్, వెంకటరమణ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాకు లేదు జాతి వైరం !

మహానంది: మనుషుల తరహాలో మాకు ఏ జాతి వైరం లేదు. మాదంటూ మూగజీవాల జాతి. మేమంతా ఒక్కటే అంటూ ఓ శునకం, బాతులు స్నేహం చేస్తున్నాయి. అలసిపోయిన ఓ శునకం ఇసుకలో ఓ కునుకేస్తుండగా నేస్తమా...మేమూ మీ వెంటే అంటూ బాతులు అక్కడికి చేరగా, అందులో ఓ బాతు శునకం ఒడిలో ఒదిగిపోయి సేద తీరుతున్న ఈ దృశ్యం గురువారం మహానందిలో కనిపించింది.



శునకం ఒడిలో సేదతీరుతున్న బాతు

శివతత్త్వంపై ప్రవచనం



శివతత్త్వంపై ప్రవచనాలు వినిపిస్తున్న ప్రవాచకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై జిల్లెళ్ళమూడికి చెందిన వి.గణేష్ వారిచే శివతత్త్వంపై ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శివతత్త్వం, శివమహిమా విశేషాలు, పలు శివస్తోత్రాల విశేషాలు, విభూతి మహిమ, రుద్రాక్షమహిమ మొదలైన అంశాలను ప్రవాచకులు భక్తులకు వివరించారు.

ఉపాధి హామీ మహిళా కూలి మృతి

ఆత్మకూరురూరల్: మండలంలోని కురుకుంద గ్రామంలో గురువారం ఉపాధి పనులకు వెళ్లిన పాలగిరి శివమ్మ (58) అనే మహిళా కూలి తీవ్ర అస్వస్థతతో మృతి చెందింది. రోజువారి పనుల్లో భాగంగా ఉదయం ఉపాధి పనికి వెళ్లిన ఆమె ఒంట్లో నలతగా అనిపించి పని తరువాత ఇంటికి వచ్చింది. నీరసంతో ఉన్న ఆమె కొద్ది సేపటికే మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త శివారెడ్డి చాలా సంవత్సరాల కిందటే మరణించడంతో తన ఇద్దరి కూతుళ్లతో శివమ్మ జీవించేది. నిరుపేద కుటుంబానికి చెందిన శివమ్మ మరణంతో ఆమె కుటుంబ సభ్యులు అనాథలుగా మారారు.

'జగనన్న సురక్ష' షెడ్యూల్ విడుదల

మిడుతూరు: వచ్చే నెల 1వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం షెడ్యూల్‌ను విడుదల చేశారు. 1వ తేదీ మిడుతూరు- 1 సచివాలయంఎంపీడీఓ కార్యాలయంలో, 04న మిడుతూరు-2 సచివాలయం, వెలుగు కార్యాలయంలో , 06న చెరుకుచెర్ల గ్రామంలో గ్రామ సచివాలయంలో, 11న తిమ్మాపురం, 13న కడుమూరు, 15న మాసపేట, 18న చౌట్కూరు, 20న నాగలూటి, 22న చింతలపల్లి, 25న అలగనూరు, 27న తలముడిపి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తమ్మడపల్లెలో గంధం స్వామి జార్తలు

మహానంది: తమ్మడపల్లె గ్రామంలో గురువారం రాత్రి గంధం స్వామి జార్తలు వైభవంగా జరిగాయి. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు పీర్లచావిడి వద్దకు చేరుకుని గంధం స్వామికి గంధం, చక్కెర, పూలబాసికాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు నిర్వహించారు. మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మహానంది: వస్త్రాల వ్యాపారం చేసుకుని తిరిగి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా కదిరికి చెందిన శివమణి, మరో ఇద్దరు వస్త్రాల వ్యాపారం చేసుకునేందుకు వచ్చి నంద్యాలకు వెళ్తుండగా బొల్లవరం మెట్ట వద్ద బస్సు, బైకు ఢీకొన్నాయి. ఈ ఘటనలో శివమణితో పాటు మరో యువకుడు గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ ఉమారాణి

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఉమారాణి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలుంటే రైతులు నేరుగా సంప్రదించాలని సూచించారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆత్మకూరు కృషి పండ్ల తోట రైతు సేవా సంఘం అధ్యక్షుడు, అర్బన్ రైతు భరోసా కేంద్ర చైర్మన్ బైరాపురం మహబూబ్ బాషా, రైతులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

అరటి రైతులను ఆదుకోవాలి

- వ్యవసాయశాఖ పీఎస్‌ను కలిసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



బీమా ప్రతిపాదనల కాపీని పీఎస్ జీకె ద్వివేదికి అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: నేలకొరిగిన అరటి తోటలను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయని, ఆకాలవర్షాలు, భారీ ఈదురు గాలులకు తీవ్రంగా నష్టపోయిన అరటి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కోరారు. విజయవాడలో గురువారం వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జీకే ద్వివేదిని కలిసి అరటి రైతులు నష్టపోయిన తీరు, బీమా పరిహారంపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానంది మండలంలో ప్రధానంగా సాగు చేసే పంటల్లో అరటి ఒకటని, ఎకరాలకు రూ.లక్షన్నర పెట్టుబడులు పెట్టి పంట దిగుబడులు చేతికొచ్చే దశలో తోటలన్నీ పడిపోవడంతో రైతులకు కన్నీళ్లే మిగిలాయన్నారు. అరటిరైతుల కష్టాలపై గతంలో అసెంబ్లీలోనూ చర్చించానని చెప్పారు. అన్ని పంటల తరహాలో అరటికి బీమా వర్తింపజేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని సైతం కలిసి మాట్లాడినట్లు తెలిపారు. తాజాగా జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి వెళ్లినప్పుడు తోటల్లో ఒక్కచెట్టు మిగలకుండా పడిపోవడాన్ని చూస్తే నాకే కన్నీళ్లు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల తరఫున వినతిపత్రంతో పాటు 2022–23 క్రాప్ సీజన్‌లో అరటి పంటను బీమా పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనల కాపీని అందజేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు శ్రమిస్తానని స్పష్టం చేశారు.

అర్హులందరికీ సం పథకాలు

మహానంది: అర్హత ఉండి పథకం రాలేదని ఏ ఒక్కరూ నిరుత్సాహపడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వర రెడ్డి తెలిపారు. మహానంది, తిమ్మాపురం, అబ్బీపురం సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష పథకంపై వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, ఎంఎల్ఓ కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు కల్లె శ్రీలక్ష్మి, శవ్వా శ్రీలక్ష్మి, సొసైటీ చైర్మన్ పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే బండిఆత్మకూరు మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ఏ.కోడూరు, కడమలకాల్వ, బి.కోడూరు గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, గృహసారథులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాగాల రమణ, నాయకులు యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: మండల పరిధిలోని బోయరేవుల, మోతుకూరు గ్రామాల్లో జగనన్న సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి వారి సమస్యలు గుర్తించాలని సచివాలయం సిబ్బందికి, గృహ సారధులకు మండల జేసీఎస్ కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి , ఎంఎల్ఓ రసూల్, సచివాలయ కన్వీనర్లు సుధాకర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, ముంతల విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

43 ప్యాకెట్ల పత్తి విత్తనాల స్వాధీనం

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా విక్రయిస్తున్న 43 ప్యాకెట్లు (32కిలోలు) పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ కేశవరెడ్డి, ఎస్ఐ జయన్నలు గ్రామంలో దాడులు నిర్వహించి నాగిరెడ్డి ఇంట్లో ఎలాంటి అనుమతులు, బిల్లుల్లేకుండా నిల్వ ఉంచిన పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఏఓ కృష్ణారెడ్డికి అప్పగించారు. అలాగే నాగిరెడ్డిపై జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఈ విషయంపై ఎస్ఐ వెంకటసుబ్బయ్యను సంప్రదించగా.. తనకు ఎవరూ ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పడం గమనార్హం. ఏఓ కృష్ణారెడ్డిని వివరణ కోరగా 6ఏ కింద నాగిరెడ్డిపై విజిలెన్స్ అధికారులు పిర్యాదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన పత్తి విత్తనాలను ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో అవకతవకలపై దృష్టి

మహానంది: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో జరుగుతున్న అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధాన ఆలయాలైన సింహాచలం, శ్రీశైలం, శ్రీకాళహస్తి, మహానంది, అన్నవరం, తదితర ఆలయాల్లో ఏళ్లతరబడి తిష్టవేసిన ఉద్యోగులపై చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ గురువారం ఆదేశాలు జారీ చేసినట్లు దేవదాయశాఖ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఆలయాల్లో వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల స్థానాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి మార్చాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు ఏళ్లతరబడి ఒకే పోస్టులో కొనసాగేవారిపై వివరాలు సేకరించినట్లు తెలిసింది.

కౌలు రైతులు కార్డులు పొందాలి

ఆత్మకూరు: మండలంలోని కౌలు రైతులందరూ తప్పని సరిగా కౌలు గుర్తింపు కార్డులు పొందాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు సూచించారు. మండలంలోని శ్రీపతిరావు పేట రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతుల అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. వెంటనే రైతులు ఆర్బీకేలో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

జూపాడుబంగ్లా: గ్రామాల్లోని ప్రజలు ఆర్థిక వ్యవహారాలు, బ్యాంకు లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి, ఏపీఎం అంబమ్మ తెలిపారు. గురువారం తూడిచెర్ల గ్రామంలో సొసైటీ ఫర్ సోషియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వారి అధ్వర్యంలో కళాజాత బృందంతో ప్రజలకు అవగాహన కల్పించారు. సంపాదనలో కొంత మొత్తాన్ని బ్యాంకుల్లో పొదుపు చేసుకోవాలని సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పొదుపు పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు రాజు, శివ, నాగరాజు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, హెల్త్ అలవెన్సుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ కోరారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాలు పర్మినెంట్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు రణధీర్, నాయకులు నాగన్న, రాజు, జోషఫ్ తదితరులు ఉన్నారు.

జంగాలపేటలో ట్యాంకర్లతో నీటి సరఫరా

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలోని జంగాలపేటకు తాగునీరు సరఫరా అయ్యే బోరు మరమ్మతులకు గురైంది. కాలనీవాసులు నీటికోసం ఇబ్బందులు పడకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్ రెడ్డి, పరిగ సుంకన్న, మోతె రాముడు, కప్పర శివ, మహేష్‌లు ట్యాంకర్‌తో నీటిని తెచ్చి కాలనీవాసులకు సరఫరా చేస్తున్నారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. బోరుకు త్వరగా మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



జంగాలపేట వాసులకు ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు